# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు అనువైన పారిశ్రామిక విధానం తీసుకురానున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **గనులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర గిరిజన మంత్రి గుమ్మిడి. సంధ్యారాణి కోరారు.**
4. **రాష్ట్రంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.**
5. **తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కాళోజీ విశ్వవిద్యాలయం తెలిపింది.**

**==========================**

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులే లక్ష్యంగా సెప్టెంబరు 20న కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు 2024-29 ముసాయిదా పారిశ్రామిక విధానంపై ముఖ్యమంత్రి నిన్న రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు అనువైన పారిశ్రామిక విధానం కోసం నిబంధనలను సరళీకరించనున్నామని తెలిపారు. కొత్త పారిశ్రామిక విధానం అమలుపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23న తుది సమీక్ష జరిపి, కొత్త విధానంపై విధివిధానాలను ఖరారు చేయనున్నామని పేర్కొన్నారు.

--------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకొని దక్షిణ కొరియా చేరుకున్నారు. నిన్న సియోల్ నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమైయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని, అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఎల్‌జీ గ్రూప్ చైర్మన్‌తో సమావేశమై తెలంగాణలో విద్యుత్ కేబుల్, గ్యాస్, ఇంధన, బ్యాటరీల ఉత్పత్తిలో పెట్టుబడులపై చర్చించారు. త్వరలో హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ కేంద్రాన్ని విస్తరించాలని హ్యూందాయ్ తెలిపింది. భారతీయ వినియోగదారుల

కోసం బెంచ్‌మార్క్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హ్యుందాయ్ ప్రతినిధులు తెలిపారు. మరోవైపు కొరియా వస్త్ర పరిశ్రమల సమాఖ్యతో రేవంత్ రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కొరియా పెట్టుబడులు వస్తాయని తెలిపారు.

-----------------------------

గనులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నిన్న ఢిల్లీలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జాతీయ ఖనిజాన్వేషణ ట్రస్ట్ పాలక మండలి సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖనిజాన్వేషణకు అత్యంత ప్రాధాన్యమివ్వనుందన్నారు. జాతీయ ఖనిజాన్వేషణ ట్రస్ట్ తరహాలోనే ఖనిజాన్వేషణ, పరిశోధన, నవకల్పన ట్రస్ట్‌ను ఏర్పాటుచేసినట్లు వివరించారు.

-----------------------------

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి. సంధ్యారాణి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ, హెచ్ఐవి-ఎయిడ్స్ వంటి అంశాలపై రూపొందించిన మీకోసం కార్యక్రమాల గోడపత్రికలను అధికారులతో కలసి నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హెచ్ఐవి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలు మెరుగు పడే మార్గాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తద్వారా పిల్లల్లో రక్తహీనత నివారణ, పోషకాల గ్రాహ్యత మెరుగు పడుతుందని చెప్పారు. అంగన్వాడీ, పాఠశాలల్లో నిర్వహించనున్న నులిపురుగులు నివారణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిన్న మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి సదస్సుల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులతో గ్రామాల్లో పలు సమస్యలు పరిష్కారమవుతాయని మంత్రి పేర్కొంటూ..

వాయిస్ (40 సెకన్లు)

-----------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర, న్యాయ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ప్రతి ఒక్కరికీ సమర్ధవంతమైన న్యాయ వ్యవస్థను అందుబాటులో తీసుకువచ్చే లక్ష్యంతో ఈ చట్టాలను కేంద్రం రూపొందించింది. దేశ న్యాయ వ్యవస్థను మరింత పరిపుష్టం చేయడంతో పాటు భారత దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతకు ఈ మూడు చట్టాలు దోహదపడ తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నూతన నేరచట్టాల

ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన నూతన నేర చట్టాలపై ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా.. తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్‌లోని తన నివాసంలో కిషన్ రెడ్డి దంపతులు జాతీయ జెండాను ఎగురవేశారు.అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయడం అందరి బాధ్యత అని. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రజలందరి భాగస్వామ్యంతో జరుగుతున్నాయని చెప్పారు. దేశ సమైక్యతను కాపాడుకునే ఈ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాలు పంచుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

……హర్ ఘర్ తిరంగా వాయిస్ (26 సెకన్లు)

-------------------------

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు కాళోజీ విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో ఇచ్చిన ప్రకటన ప్రకారం ఆన్‌లైన్ నమోదు, ధృవపత్రాల అప్‌లోడ్‌కు ఈ రోజు సాయంత్రం 6 గంటలతో గడువు ముగియనుండగా, తాజాగా ఈ గడువును మరో రెండు రోజులు పెంచుతున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ తెలిపారు. నీట్–యూజీలో అర్హత సాధించిన విద్యార్థులు రాష్ట్రంలో కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

-------------------------

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని బౌద్ధ మహాస్థూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యానమందిరం, బౌద్ధ మహాస్థూపాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఆయన నిన్న సందర్శించారు. స్థానిక బౌద్ధ మహాస్థూపం విశేషాలను పురావస్తు శాఖ, పర్యటక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, క్రీస్తుశకం రెండో శతాబ్దం నాటి ఈ స్థూపాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వెంటనే రోడ్‌మ్యాప్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి పర్యటకులు సందర్శించేలా వసతులు మెరుగుపరచనున్నామని తెలిపారు.

-------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అన్నా క్యాంటీన్ల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నిన్న అమరావతిలో ఆయన మాట్లాడుతూ, తొలి విడతలో 100 క్యాంటీన్లను అందుబాటులోకి తెస్తామన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఈ నెల 15న సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. ఆ మరుసటి రోజు ఆగస్టు 16న మిగిలిన 99 క్యాంటీన్లను రాష్ట్ర మంత్రులు, ఆయా శాసనసభ్యులు వారి ప్రాంతాల్లో ప్రారంభిస్తారని మంత్రి నారాయణ వెల్లడించారు.

=====================